క్లుప్తంగా

మొక్కల పెంపకం ఎంతో కీలకం: క్రిస్టియాన



మొక్క నాటుతున్న క్రిస్టియాన తదితరులు

గజ్వేల్‌రూరల్‌: మానవజాతి మనుగడకు మొక్కల పెంపకం ఎంతో కీలకమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ కమలా క్రిస్టియాన అన్నారు. వనమహోత్సవంలో భాగంగా సోమవారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయని, తద్వారా మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. అందకే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు కస్తూరిబాయి, డాక్టర్‌ జయరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకే షీ టీమ్‌



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రుక్కమ్మ

వర్గల్‌(గజ్వేల్‌): మహిళల భద్రతకు ఎల్లవేళలా షీ టీమ్‌ అందుబాటులో ఉంటుందని గౌరారం ఏఎస్‌ఐ రుక్కమ్మ అన్నారు. వర్గల్‌ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్‌ విధులు, ర్యాగింగ్‌, సైబర్‌ మోసాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. డ్రగ్స్‌, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ మహేందర్‌ రెడ్డి, కానిస్టేబుల్స్‌ శ్యామల, మహేశ్‌, హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



స్టాక్‌ పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

దౌల్తాబాద్‌ (దుబ్బాక): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని దుబ్బాక ఏడీఏ మల్లయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆధార్‌ కార్డు, పీఓఎస్‌ మిషన్ల ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, నానో యూరియానే వినియోగించాలని రైతులకు సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని దుకాణదారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఓ సాయి కిరణ్‌, ఏఈఓ సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా రామంచ బడి



బ్యాగులు చూపుతున్న విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు దాతల సహకారంతో ఇతర అవసరాలను తీరుస్తున్న రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంఈఓ యాదవరెడ్డి ప్రశంసించారు. రామంచ పాఠశాలలో ప్రమీల–ప్రభాకర్‌ల సహాయంతో 95 మంది విద్యార్థులకు బ్యాగులు, బ్యాడ్జీలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకిత భావం, దాతల సహకారం, తల్లిదండ్రుల తోడ్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్‌ షరీఫ్‌, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్‌, వరప్రసాద్‌, యాదయ్య, లలిత, సునీత, నాగమణి, వాణి పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

కొండపాక(గజ్వేల్‌): విద్యుత్‌ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డివిజన్‌ ఆర్టిజన్‌ కార్మికుల ప్రధాన కార్యదర్శి సిరినేని భూపతిరాజు డిమాండ్‌ చేశారు. చలో వరంగల్‌ సభకు చెందిన పోస్టర్‌ను మర్పడ్గ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఆవిష్కరించారు. 14న తలపెట్టిన చలో వరంగల్‌ సభను విజయవంతం చేయాలన్నారు. బుచ్చిరెడ్డి, రమేశ్‌, రాజేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల మల్లేశం, పర్శరాములు, కిష్టయ్య, బాల కొమురయ్య, కనకరాజు, నర్సింహాచారి, షాదుల్‌ తదితరులు పాల్గొన్నారు.

సంపు.. గొంతెప్పుడు తడుపు?

గిరిజనతండాలకు అందని 'భగీరథ'

- నిరుపయోగంగా నిర్మాణాలు
- తాగునీరు కోసం కిటకిట
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా ఉన్న చౌటకుంటతండా సమీపంలో నిర్మించిన సంపు

వాళ్లంతా గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన గిరిజనులు. సర్వస్వం కోల్పోయి తమకు అనుకూలంగా ఉన్న చోట్ల ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న దుస్థితి. ప్రస్తుతం ఆ గిరిజనతండాలకు కనీసం తాగు నీరు అందక గొంతెండుతున్నాయి. వారికి 'మిషన్‌ భగీరథ' నీరు ఓ కలగానే మిగిలింది.

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలోని బంజారాహిల్స్‌, సేవ్యానాయక్‌తండా, ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీతోపాటు చౌటకుంట తండాలకు భగీరథనీరు సరఫరా కావడంలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా అవి అంతంతమాత్రంగానే ఉన్నాయి. తాగునీరు అందించేందుకు నిర్మించిన సంపు నిరుపయోగంగా మారింది.

తాగునీటి ఇక్కట్లు

ప్రస్తుతం బంజారాహిల్స్‌తండా, సేవ్యానాయక్‌తండాల్లో నిర్మించిన ట్యాంకులకు గౌరవెల్లి ప్రాజెక్టులో ఉన్న బావి నుంచి పైపులైన్‌ ఏర్పాటుచేసి తాగునీరు అందిస్తున్నారు. చౌటకుంట, సీతారాంతండాల్లో ఉన్న నల్లాలబావిలో నుంచి తాగునీటి కోసం కనెక్షన్‌ ఇచ్చారు. అయితే భారీ వర్షాలు పడితే ఈ బావి పూర్తిగా వర్షపునీటితో నిండిపోయి నీరు కలుషితం అవుతుంది. దీంతో తండాలవాసులు వ్యవసాయ బావులకు పరుగులు పెట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ(పునరావాస కాలనీ)లో నిర్మించిన భగీరథ వాటర్‌ ట్యాంక్‌కు మాత్రం ఎలాంటి కనెక్షన్‌ ఇవ్వలేదు. దీంతో ప్రస్తుతం ఈ పునరావాసకాలనీలో గిరిజనులు తాగునీరు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో వేసుకున్న బోర్లపైనే ఆధారపడి అరకొర నీళ్లు తాగుతున్నామని వాపోతున్నారు.

భగీరథ నీరు కలేనా?

చౌటకుంటతండా సమీపంలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో మిషన్‌ భగీరథ సంపు నిర్మించారు. ఈ సంపు నిర్మాణానికి రూ.1.58 కోట్ల నిధులు వెచ్చించారు. మార్చిలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ సంపు ద్వారానే ఆ నాలుగు గిరిజనతండాలకు పైపులైన్ల ద్వారా ట్యాంక్‌లకు తాగునీరు ఎక్కించేందుకు ఏర్పాటు చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఈ సంపు ద్వారా తాగునీరు అందించాలంటే కొత్తగా ఒక విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయవల్సి ఉంది. అందుకు సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. దీనిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలన్నింటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయాల్సిఉంది

మార్చి నెలలోనే సంపు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చౌటకుంట తండా సమీపంలో నిర్మించిన సంపు ద్వారా నాలుగు తండాలకు తాగునీరు సరఫరా ఉంటుంది. అయితే ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయాల్సి ఉంది. సంపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుకు రూ.10.26 లక్షలు వెచ్చించాలని ఉన్నతాధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ప్రస్తుతం సంపు నిరుపయోగంగానే ఉంది.

– సాయికృష్ణ, ఏఈ మిషన్‌ భగీరథ

కొండపోచమ్మ పునర్నిర్మాణ కమిటీ నియామకం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండలంలోని తిగుల్‌ నర్సాపూర్‌ సమీపంలోని కొండపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్‌ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిటీలో పది మంది సభ్యులకు చోటు కల్పించారు. ఏడాది పాటు కొనసాగనుంది. సభ్యులుగా కప్పర అనుగీతా(తిగుల్‌), వెంకటరామిరెడ్డి(వట్టిపల్లి), మాసపాక అనసూర్య(తిగుల్‌ నర్సాపూర్‌), జుర్రు రాజు (ధర్మారం), ఎడ్ల జనార్దన్‌రెడ్డి (తిగుల్‌), గడ్డం రాజు (చాట్లపల్లి), పోకల నర్సింహులు (బిజివెంకటాపూర్‌), మంగి కిషన్‌, చిట్టి దేవేందర్‌రెడ్డి (హైదరాబాద్‌) నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌ రెడ్డి, కొండా సురేఖ, మంత్రులు వివేక వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మంది అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్‌



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరేందర్‌, చిత్రంలో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం

తూప్రాన్‌: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ నరేందర్‌గౌడ్‌ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పోతరాజపల్లి గ్రామశివారులోని హనుమాన్‌ వెంచర్‌లో ఎనిమిది మంది యువకులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ శివానందం తన సిబ్బంది, క్లూస్‌ టీంతో కలిసి దాడి చేసి.. ఆరుమందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు యువకులు తప్పించుకొని పారిపోయారు. నిందితుల నుంచి 260 గ్రాముల గంజాయిని, ఐదు సెల్‌ఫోన్లు, రెండు టూ వీలర్లు వాహనాలు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పాటల పల్లకీని విజయవంతం చేయండి

మెదక్‌జోన్‌: 13న మెదక్‌లోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించే పాటల పల్లకి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ సింగర్‌ నేర్నాల కిషోర్‌ పేర్కొన్నారు. సోమవారం మెదక్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రావును కలిసి అందుకు సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రం కోసం గొంతెత్తి పాడిన ఎంతో మంది కళాకారులను అప్పటి ప్రభుత్వం గుర్తించలేదని కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి జిల్లాలో కొనసాగిస్తున్నామన్నారు.

అంబరాన్నంటిన పీర్ల ఊరేగింపు




సిర్సనగండ్లలోని చౌరస్తాలో పీర్ల ఊరేగింపు

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో సోమవారం మోహర్రం సంబురాలు అంబరాన్నంటాయి. గ్రామంలోని రెండు మసీదుల్లో సుమారు 25 పీర్లను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి నుంచి గ్రామంలో పీర్ల పండుగ సంబురాలు ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి 7 గంటల వరకు గ్రామంలో పీర్లను ఊరేగించారు. పలువురు దట్టీలు, ఊదు బెల్లంలను సమర్పించుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు గ్రామ పంచాయతీ వద్ద ఆసెన్న.. ఊసెన్న ఆటలు ఆడారు. వర్షాన్నికూడా లెక్క చేయకుండా ప్రజలు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం పీర్లను చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల మండలాలను నుంచి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు.

పాండురంగాశ్రమంలో ముగిసిన ఉత్సవాలు

స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పాండురంగ స్వామి



స్వామిని దర్శించుకోడానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

మర్కూక్‌(గజ్వేల్‌): పాండురంగాశ్రమంలో నిర్వహించిన ఆషాఢి త్రిరాత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. భావానందాపూర్‌లోని పాండురంగాశ్రమంలో సోమవారం ఉదయం భక్తులు ఉపవాస దీక్షలు విరమించుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు స్వామి వారికి మహాఅన్నదాన పూజా కార్యక్రమాలు, రుక్మిణీ పాండురంగ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాధ మండపంలో భక్తులను నేలపై కూర్చొబెట్టి మోతుకు ఆకుల ఇస్తరాకులలో అన్న ప్రసాదాన్ని సాంబారుతో వడ్డించారు. కరీంనగర్‌ ఉపాధ్యాయ కంటెస్టెడ్‌ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌ శర్మ, ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోవడం వల్లే..

ఏసీపీ నర్సింహులు



అధికారులకు సూచనలిస్తున్న ఏసీపీ నర్సింహులు

గజ్వేల్‌: ట్రాఫిక్‌ నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని ఏసీపీ నర్సింహులు అన్నారు. రాజీవ్‌రహదారిపై ప్రమాదాలకు నిలయంగా మారిన సింగాయపల్లి చౌరస్తా, ముట్రాజ్‌పల్లి టీ–జంక్షన్‌, పాతూర్‌ జంక్షన్‌, రిమ్మనగూడ, కొడకండ్ల, చిన్నకిష్టాపూర్‌ టీ–జంక్షన్‌, లకుడారం యూటర్న్‌ చౌరస్తాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతివేగంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడపటం తదితర కారణాలతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రమాదాల నియంత్రణకు థర్మో ప్లాస్టిక్‌ పెయింట్స్‌, రేడియం స్టైడ్స్‌, బ్రింగ్‌ లెటర్స్‌, సైనింగ్‌ బోర్డు, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే రహదారికి రెండు పక్కలా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాల వేగ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సీఐలు సైదా, మహేందర్‌రెడ్డి, ట్రాఫిక్‌ సీఐ మురళి, గౌరారం ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌, హెచ్‌కేఆర్‌ ఏఈలు రవీందర్‌, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఏపీఓ మృతికి నివాళి

మిరుదొడ్డి(దుబ్బాక): జనగామ జిల్లా దేవరుప్పల మండల ఏపీఓగా పనిచేసిన కమ్మగాని శ్రీనివాస్‌ గుండె పోటుతో మృతి చెందారు. ఎంపీడీఓ, ఉపాధి హామీ సిబ్బంది సోమవారం శ్రీనివాస్‌ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, ఎంపీఓ ఎండీ. జహూరొద్దీన్‌, ఏపీఓ సుభాష్‌, ఉపాధి సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాములు, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపులో అవకతవకలు



మాట్లాడుతున్న రవీందర్‌

కొమురవెల్లి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, ఉన్నతాధికారులు స్పందించి తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో తేలు ఇస్తారి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు మంజూరు కావల్సిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో భారీ అవినీతి జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా అధికారులు అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని వాపోయారు. జనగామ డీసీసీ అధక్షుడు ఏ హోదాతో మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోస్తున్నారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లంపల్లి సాయిలు, బక్కెల్లి బాలకిషన్‌, కానుగుల రాజు, కర్రోళ్ల ఎల్లయ్య, ఆరుట్ల రవీందర్‌ పాల్గొన్నారు.

కృష్ణమాదిగ పోరాట ఫలితమే వర్గీకరణ

ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్‌



ములుగులో జరిగిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్‌ నేతలు

ములుగు(గజ్వేల్‌): ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమయిందని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేశ్‌ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్‌ 31వ ఆవిర్భావ దినోత్సవంతోపాటు మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ములుగులో సోమవారం ఎమ్మార్పీఎస్‌ జెండాను ఎగురవేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ లేకుంటే ఎస్సీ వర్గీకరణ సాధ్యమయ్యేది కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్‌, ఆయా పార్టీల నాయకులు ఆదాస్‌ మహేశ్‌, రమేశ్‌, రమణ, శ్రీనివాస్‌, వాజీద్‌, నర్సింహులు, నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

రాజీలేని పోరాటం వల్లే..

గజ్వేల్‌: మందకృష్ణ మాదిగ చేసిన రాజీలేని పోరాటం వల్లే వర్గీకరణ సాధ్యమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ మంద కృష్ణ ఎన్నో సామాజిక ఉద్యమాలు నిర్మించారని గుర్తు చేశారు. నాయకులు మంద కుమార్‌, ఆంజనేయులు, రాములు, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): మంద కృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని మాదిగ కుల సంఘాల నాయకులు అన్నారు. సిద్దిపేట బీజేఆర్‌ చౌరస్తాలో వారు ఎమ్మార్పీఎస్‌ జెండా ఆవిష్కరించారు. అంబేడ్కర్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్‌ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్‌లు, రేషన్‌ బియ్యం కోటా పెంపు కోసం మందకృష్ణ మాదిగ పోరాటం చేశారని గుర్తు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరిశంకర్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రం, రియాజొద్దీన్‌, ఇస్తారి, యాదగిరి, పరశురాములు, మహేందర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ



గజ్వేల్‌రూరల్‌: రాణే పరిశ్రమ వద్ద నినాదాలు చేస్తున్న పద్మశ్రీ తదితరులు

గజ్వేల్‌రూరల్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్‌ చేశారు. ప్రజ్ఞాపూర్‌ శివారులోగల రాణే పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించిన గేట్‌ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కార్మికులతో కార్పొరేట్‌లకు వెట్టి చాకిరీ చేయించేందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసిందని, నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని మండిపడ్డారు. పరిశ్రమల్లో శాశ్వత కార్మికులు లేకుండా, పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు వేణుగోపాల్‌, బండ్ల స్వామి, భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రావ్‌, రంగారెడ్డి, స్వామి, సాజిద్‌, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కోసమే..

చేర్యాల(సిద్దిపేట): పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్‌ కోడ్‌లు తెచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో, మండల కార్యదర్శి బండకింది అరుణ్‌, నాయకులు కరీం, శ్రీనివాస్‌, కనకయ్య, కుమార్‌, సంపత్‌, తిరుపతి, మల్లేశం, రాజు, ప్రభాకర్‌ తదిరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఫార్మర్‌ రిజిస్ట్రీ తప్పనిసరి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్‌ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈఓ రేణుక సూచించారు. రైతు వేదికలో ఈకేవైసీ ప్రక్రియపై రైతులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని డిజిటలైజ్‌ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

◆ మందుబాబుకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానాతోపాటు ఒక్కరికి జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌, టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.23,500 జరిమానా, వారిలో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

◆ ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

సిద్దిపేటఅర్బన్‌: తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన గణేశ్‌ జగదేవ్‌పూర్‌ మండలం దౌలాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పొన్నాల ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లలను సోమవారం ఎల్‌కేజీ, ఒకటో తరగతిలో చేర్పించారు. సిద్దిపేట నుంచి పొన్నాల పాఠశాలకు చేరేందుకు గాను ఆటో ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఎంఈఓ రాజప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌ అతడిని అభినందించారు.

◆ ఎస్‌ఎఫ్‌ఐ రాస్తారోకో

సిద్దిపేటకమాన్‌: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పెండింగ్‌ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్‌ చేశారు. బస్టాండ్‌ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజ్‌ రీయింబర్స్‌మెంట్స్‌ పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు.

◆ పేదల పక్షపాతి కాంగ్రెస్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్‌ అంటేనే పేదల ప్రభుత్వమని, పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్‌ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్లీపూర్‌, ఒబులాపూర్‌, కిష్టాపూర్‌ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జయంత్‌, పరశురాములు తదితరులు ఉన్నారు.


◆ బీఆర్‌ఎస్‌ నాయకుల సమావేశం

మద్దూరు(హుస్నాబాద్‌): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని బీఆర్‌ఎస్‌ పార్టీ ధూళ్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పార్టీ అందించిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు బాలనర్సయ్య, నగేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ పూర్వ విద్యార్థుల సాయం

మద్దూరు(హుస్నాబాద్‌): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు కొందరు పూర్వ విద్యార్థులు. స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 1985–1986లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం పాఠశాల హెచ్‌ఎంకు రూ.38,780 సాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

◆ కుటుంబ కలహాలతో ఆత్మహత్య



షాదుల్లా

దుబ్బాకటౌన్‌: కుటుంబ కలహాలతో జీవితం మీద విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్‌ మండలం ఎల్కల్‌ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బేగంపేట పోలీసుల కథనం ప్రకారం.. రాయపోల్‌ మండలం ఎల్కల్‌ గ్రామానికి చెందిన మొహమ్మద్‌ షాదుల్లా (36) టైల్స్‌, మేస్త్రీ పని చేసుకుంటూ.. జీవనం సాగిస్తుండేవాడు. షాదుల్లాకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితం మీద విరక్తితో ఆదివారం రాత్రి 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌ రెడ్డి తెలిపారు.